

# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త


## మండల, మునిసిపల్ కార్యాలయాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక



**నెల్లూరు అర్బన్, నవంబర్ 17, ప్రభాతవార్త** ప్రజల వద్దకు పరిపాలనను మరింత చేరువ చేసే ప్రయత్నంలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని వికేంద్రీకరణ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఒ. ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుండి మున్సిపల్ కార్యాలయాల్లో, మండల కేంద్ర కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కొరకు వారికి చేరువలోని మండల కార్యాలయాల్లో అర్జీలు సమర్పించవచ్చునన్నారు. అదేవిధంగా అధికారులందరూ ఫిర్యాదులను నిర్దిష్ట సమయంలోగా త్వరితగతిన పరిష్కరించాలని, అలాగే పరిష్కారంలో అత్యున్నత ప్రమాణాలను పాటించాలన్నారు. ఈ విధమైన పాలనను మరింత అందుబాటులోకి తీసుకురావడానికి, పారదర్శకంగా, ప్రజల అవసరాల కనుగుణంగా ప్రభుత్వం ప్రతిస్పందిస్తుందని, ఆవిధమైన ప్రభుత్వ నిబద్ధతను ప్రజలకు తెలియజేస్తుందన్నారు. మండల స్థాయి అధికారులందరూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం పై ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యలను పరిష్కరించాలన్నారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం,నవంబర్17ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం 7,444 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో69.984 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 400, ఎన్ఎఫ్‌సికి 550, పెన్నా డెల్టాకు 50, కండలేరు వరద కాలువకు3000 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.484మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## కొండబిట్రగుంటలో 4.48 కోట్లతో శృంగేరి పీఠాదిపతిచే శంకుస్థాపన







**బిట్రగుంట,నవంబర్17,ప్రభాతవార్త :** బోగోలు మండలం కొండబిట్రగుంటలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ప్రసన్నవేంకటేశ్వరస్వామి దేవస్థానంలోఆదివారం కర్నాటక రాష్ట్రానికి చెందిన శృంగేరి శారద పీఠ జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విధుశేఖరభారతి మహాస్వామివారిచే 4కోట్ల48లక్షల రైపాయలతో వివిద అభివృద్ధి పనులకు రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి,నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికావలి శాసనసభ్యుడు దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి,టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి మాజి ఎంఎల్‌సి బీదా రవిచంద్ర సమక్షంలో శంకుస్తాపనచేశారు.ఆలయంలో 2.60 కోట్లతో ఆలయ గాలిగోపురం 1.65కోట్లతో ఆలయ మహాప్రాకారం 23లక్షలతో రధశాల నిర్మాణ పనులకు ఈసందర్భంగ శిలాఫలకాలని వారు ఆవిష్కరించారు.భక్తుల గోవిందనామస్మరణలు వేదపండితుల వేదమంత్రోశ్చరణలు మంగళకర మేళతాళాలతో ఈకార్యక్రమం జరిగింది. ఈసందర్భంగ విధుశేఖర బారతిమహాస్వామి మాట్లాడుతు సనాతన ధర్మ, ప్రాచీన దేవాలయాల సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వంచేస్తున్న కృషిని ఆయన ప్రశంశించారు.తన జిల్లా విజయయాత్రలో భాగంగ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకొని ఆయల అభివృద్ధికార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయడం చాలా సంతోషంగ వుందన్నారు.ఈప్రాంతంలో రానున్నరోజుల్లో ఈదేవస్థానం మరింత అభివృద్ధిచెంది భక్తుల కోర్కెలుతీర్చే శ్రీప్రసన్నుడి ఆశీస్సులు అందరికి అందేల వుండాలని తీను ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.దేవాలయాల పరిరక్షణఅందరి భాద్యతని అది గుర్తెరిగి వాటిని సంరక్షించుకున్నప్పుడే హిందుమతం విరాజిల్లుతుందన్నారు.తొలుత ఆలయానికి విచ్చేసిన శృంగేరి శారదాపీఠం జగద్గురువులు విజయశేఖర భారతి మహాస్వామికి,దేవాదయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డికి దేవస్థాన అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు అంతకుముందు దేవస్థానంచుట్టు గోవింద నామస్మరణతో గిరి ప్రదక్షణ కార్యక్రమం నిర్వహించారు. జగద్గురువు శృగేరిపీఠదిపతి విజయశేఖర మహాస్వామి ఈసందర్భంగ శారదాపీఠంనుండి తనవంతు దేవస్థానానికి లక్ష రూపాయలు విరాళాన్ని అందజేశారు.ఈకార్యక్రమంలో కావలి నియోజకవర్గంలోని టిడిపి నేతలు,భక్తులు అధికసంఖ్యలో హాజరై జగద్గురువు విజయశేఖర మహాస్వామివారి ఆశీస్సులుపొందడంతోపాటు ఆయన ప్రవచనాలనుకూడ ఆలకించి తమజన్మ ధన్యమైందని వారు భావించారు.కాగ ఆదివారం ఉదయం కావలి శాసనసభ్యులు దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి దేవస్థానాన్ని తొలిసారిగ ఎంఎల్ఎ హోదాలో గేలుపొందిన అనంతరం సందర్శించి శంకుస్థాపన ఏర్పాట్లను స్వయంగ పర్యవేక్షించారు.

## స్వర్ణలింగేశ్వర స్వామి సేవలో ఎంపి వేమిరెడ్డి, మంత్రి పొంగూరు నారాయణ

### దీపా వెంకట్ దంపతుల దాతృత్వం అభినందనీయం



**నెల్లూరు రూరల్, నవంబర్ 17, ప్రభాతవార్త** స్వర్ణలింగేశ్వర స్వామి ఆలయ నిర్మాణంతో గణేష్ ఘాట్ శోభాయమానంగా వెలుగొందుతుందన్నారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డితో కలిసి ఆయన నెల్లూరు చెరువు సమీపంలోని స్వర్ణలింగేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపి వేమిరెడ్డి మాట్లాడుతూ స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ మహాకుంభాభిషేకంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. జీర్ణోద్ధరణ కార్యక్రమం ద్వారా స్వర్ణలింగేశ్వర స్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరగా తీర్చిదిద్దిన దీపా వెంకట్ దంపతుల దాతృత్వాన్ని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కొనియాడారు. స్వర్ణలింగేశ్వర స్వామి ఆలయ జీర్ణోద్ధర కార్యక్రమంతో నెల్లూరు చెరువు పరిసరాలు శోభను సంతరించుకున్నాయన్నారు. స్వర్ణాల చెరువు తీరాన ఆహ్లాదకర వాతావరణంలో వెలసి వున్న స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయం భవిష్యత్తులో ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లడంతో పాటు భక్తులకు మానసిక స్వాంతన ప్రసాదిస్తుందన్నారు. ఎంపీ వేమిరెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీమతి దీపా వెంకట్ దంపతులతో పాటు నెల్లూరు డిప్యూటి మేయర్ రూప్ కుమార్ యాదవ్, టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, బిజెపి సీనియర్ నాయకులు జనార్దన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## పన్నులు సకాలంలో చెల్లించి..స్మార్ట్ సిటికీ సహకరించండి: మంత్రి నారాయణ



**నెల్లూరు కార్పొరేషన్,నవంబర్ 17,ప్రభాతవార్త:** సకాలంలో పన్నులు చెల్లించి నెల్లూరును స్మార్ట్ సిటీ చేసేందుకు అందరూ సహకరించాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ప్రజలను విజ్ఞప్తి చేశారు.ఆదివారం కార్పొరేషన్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు.స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పన్నులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉంటే దృష్టికి తీసుకరావాలని సూచించారు.సమీక్ష సమావేశం అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ మొండి బకాయిలపై సోమవారం నుంచి శనివారం వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని వెల్లడించారు.స్థానిక సంస్థలు మనుగడ సాధించాలంటే కార్పొరేషన్ లో మున్సిపాలిటీలో ప్రజలు తప్పనిసరిగా టాక్స్ కట్టాలన్నారు.ప్రాపర్టీ టాక్స్ ఏడాదికి 71 కోట్లు వస్తుందని అధికారులు స్పెషల్ డ్రైవ్ చేస్తే 100 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందన్నారు.ఇప్పటికే 93 కోట్ల రూపాయల పాత బకాయిలు ప్రాపర్టీ టాక్స్ వసూలు చేయాల్సి ఉందన్న ఆయన అభివృద్ధి పనులు త్వరితగతిన జరగాలంటే ప్రజలు తప్పనిసరిగా టాక్స్ చెల్లించాలన్నారు.టైన్ ప్లానింగ్ నిబంధనల మేరకే ఇళ్ల నిర్మాణాలు చేసుకోవాలని...అవసరమైన అనుమతులు నిర్ణీత సమయంలోనే వచ్చేలా చర్యలు తీసుకుంటామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.వైసీపీ హయాంలో టౌన్ ప్లానింగ్ విభాగాన్ని నిర్వీర్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సమీక్ష సమావేశంలో కమిషనర్ సూర్యతేజ తో పాటు,డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ అధికారులు పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదుని వేగవంతం చేయండి



**నెల్లూరు, నవంబర్ 17, ప్రభాతవార్త-వైద్యం** టీడీపీ సభ్యత్వ నమోదు ప్రక్రియ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ ,జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ అజీజ్‌లు తెలిపారు. నెల్లూరు నగరంలోని గోమతి నగర్‌లో ఉన్న మంత్రి నారాయణ క్యాంపు కార్యాలయంలో ఆయన టీడీపీ కార్యకర్తలు, నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలన ప్రజా వ్యతిరేకంగా సాగిందన్నారు. అందుకనే ప్రజలు ఆ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేశారని, కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. ఈ సందర్భంగా సభ్యత్వం నమోదు కార్యక్రమంపై కార్యకర్తలు వారు అవగాహన కల్పించారు. సభ్యత్వ నమోదును ప్రాధాన్యంగా తీసుకుని నేతలు, కార్యకర్తలు రికార్డు స్థాయిలో నిర్వహించాలని మంత్రి నారాయణ అభ్యర్థించారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, పార్టీ ముఖ్య నేతలు, నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కోలాహలాంగా నెల్లూరు సిటీ నియోజకవర్గంలో వైస్సార్సీపీ కార్యకర్తలు



**నెల్లూరు రూరల్, నవంబర్ 17, ప్రభాతవార్త** నెల్లూరు సిటీ నియోజకవర్గంలో వైసీపీ నాయకులు మాబాషా ఆధ్వర్యంలో నెల్లూరు సిటీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర నియోజకవర్గ ఇన్ చార్జ్, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని కలసిన వందలాది మంది వై సి పి నాయకులు కార్యకర్తలు. నెల్లూరు రాంజీ నగర్‌లోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కార్యాలయానికి 52 వ డివిజన్ వైసీపీ నాయకులు 500 మంది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ని కలిశారు. వైసిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకోవడంతో ఆ ప్రాంతం సందడిగా మారింది.. జై జగన్ నినాదాలతో ఆ ప్రాంతం మారుమోగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి అన్ని విధాల మేలు జరగాలని ఆకాంక్షిస్తూ మత పెద్దలు అల్లాను ప్రార్థిస్తూ ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని నాయకులు, కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. చంద్రశేఖర్ రెడ్డి నాయకత్వంలో తామంతా పనిచేస్తామని నెల్లూరు సిటీ నియోజకవర్గంలో రాష్ట్రంలో మళ్లీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సూచనల మేరకు పని చేస్తామని తెలిపారు.

## సుజయ్ కృష్ణ రంగారావు సన్మానించిన పెళ్లకూరు



**కోవూరు, నవంబం17ప్రభాతవార్త :** రాష్ట్ర ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మాజీ మంత్రి సుజయ్ కృష్ణ రంగారావును తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి , జోన్-1 కోఆర్డినేటర్ పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు పలు విషయాలపై చర్చించుకున్నారు.

## ప్రభుత్వ హాస్టల్ భవనాలకు నిధులు మంజూరు చేయాలి



**వింజమూరు, నవంబర్17ప్రభాతవార్త:** వెనుకబడిన ఉదయగిరి నియోజకవర్గంలో ఆరు ప్రభుత్వ హాస్టల్స్ ఉన్నాయని వాటిలో సుమారు 342మంది విద్యార్థులు ఉన్నారని , శిథిలమైన భవనాల్లో విద్యార్థులు ఉండాల్సిన పరిస్థితి ఉందని , వాటి స్థానంలో కొత్తభవనాలకు నిధులు మంజూరు చేయాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సాంఘిక శాఖామంత్రి డోలా వీరాంజనేయులుకు శనివారం వినతిపత్రం అందజేశారు. వసతిగృహాల్లో అభద్రతా భావంతో విద్యార్థులు వర్షాకాలం కంటిమీద కునుకు లేకుండా ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకువస్తుందోననే ఆందోళనలో విద్యార్థులున్నా రన్నారు. ఉరుస్తున్న వర్షపునీరు, ఊడుతున్న పైకప్పు పెచ్చులతో తీవ్ర ఇబ్బందులను విద్యార్థులు ఎదుర్కొంటున్నారన్నారు. యుద్ధ ప్రాతిపదిక అవసరమైన చోట కొత్త భవనాలు, పైకప్పుల మరమ్మత్తులు , ఫ్లోరింగ్ , కాంపౌండ్ గోడలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు . విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలోఉంచుకొని ఆర్ఒ ప్లాంట్‌లను కూడా ఏర్పాటు చేయాలని కోరారు. ఇటీవల కేటాయించిన బడ్జెట్ నిధుల్లో సుమారు 78లక్షల రూపాయలను మంజూరు చేయాలని ఎమ్మెల్యే మంత్రిని కోరారు.

## కావలిలో తలసేమియా డేకేర్ సెంటర్ ప్రారంభం చెప్పుకోదగ్గ విశేషం

### కావలి రెడ్‌క్రాస్‌కు చేయూతనందిస్తా
### కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి





**కావలి, నవంబర్ 17 ప్రభాతవార్త** కార్పొరేట్ నగరాల్లో ఉండాల్సిన తలసేమియా డేకేర్ సెంటర్ కావలి రెడ్‌క్రాస్ రక్తకేంద్రంలో ఏర్పాటుచేయడం చెప్పుకోదగ్గ విశేషమని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. కావలి రెడ్‌క్రాస్‌కు చేయూతనందిస్తానన్నారు. కావలి ఆర్డీఓ కార్యాలయ ఆవరణంలోని రెడ్‌క్రాస్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన తలసేమియా డేకేర్ సెంటర్‌ను ఆదివారం కావలి ఎమ్మెల్యే దగుమాటి ప్రారంభించారు. అక్కడ చికిత్స పొందుతున్న తలసేమియా బాధిత బాల,బాలికలను ఆయన పేరుపేరునా పలకరిస్తూ పరామర్శించారు. వారికి మానసిక ధైర్యం కల్పించారు. అనంతరం ఆధునీకరించిన రక్తకేంద్రంను రెడ్‌క్రాస్ రాష్ట్ర ఛైర్మన్ డాక్టర్ ఆరుమళ్ల శ్రీధర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అక్కడ నూతనంగా ఏర్పాటుచేసిన యంత్రసామాగ్రిని, పరికరాలను పరిశీలించి వివరాలు అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ సమావేశమందిరంలో ప్రముఖవైద్యులు, రెడ్‌క్రాస్ రక్తకేంద్రం కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి మాట్లాడారు. తనకు రెడ్‌క్రాస్ అంటే కేవలం రక్తసహాయంచేసే సంస్థగానే తెలుసునన్నారు. అయితే, కావలి రెడ్‌క్రాస్‌లో పన్నెండురకాల సేవలు అందుబాటులోఉన్నాయని ఇప్పుడే తెలిసిందన్నారు. 1863వ సంవత్సరములో హెన్రీడునాంట్ ప్రారంభించిన రెడ్‌క్రాస్ ఖండాతరాలను దాటి కావలికిచేరి ప్రజలకు ఎనలేని సేవలు అందించడం విశేషమన్నారు. సంబంధిత మంత్రులతో మాట్లాడి ప్రభుత్వంనుండి తగుసహాయం అందిస్తానన్నారు. కావలిని కనకపట్నంగా తీర్చిదిద్దాలని తన ఆకాంక్షలో రెడ్‌క్రాస్‌కూడా ఒక భాగమై తద్వారా ప్రజలకు సేవలుఅందిస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా ఒకసేవాసంస్థగా ఇలాగే ఉండేలా చూడాలన్నారు. కావలి కనకపట్నం దిశగా అడుగులు వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర ఛైర్మన్ డాక్టర్ ఆరుమళ్ల శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ తాను జాతీయపాలకమండలి సభ్యునిగా కూడా ఉన్నానన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా కావలిలాంటి చిన్నపట్టణంలో రెడ్‌క్రాస్ కావలిశాఖ అందించే సేవలు నిరుపమానమన్నారు. కావలికి తగినగుర్తింపు ఇచ్చేందుకు తాము డాకారపు రవిప్రకాష్‌కు రెండుసార్లు రాష్ట్ర పాలకమండలిలో స్థానం కల్పించామన్నారు. రెడ్‌క్రాస్‌కు ఆర్థికంగా సహకరిస్తున్న దాతలకు అభినందనలు తెలిపారు. రెడ్‌క్రాస్ జిల్లాశాఖ ఛైర్మన్, శాసనమండలి సభ్యులు పి.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ రోజు ప్రారంభించిన తలసేమియా డేకేర్ సెంటర్‌కు తమ పూర్తి సహకారం అందిస్తామన్నారు. డాక్టర్ బెజవాడ రవికుమార్, డాకారపు రవిప్రకాష్‌లు కావలి రెడ్‌క్రాస్‌కు అందించే సేవలను వివరించారు. అనంతరం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిని రెడ్‌క్రాస్ బాధ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్‌కు విరాళాలిచ్చిన 28మంది దాతలను దుశ్శాలువాలతో, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా కార్యవర్గ సభ్యుడు, కావలి కోశాధికారి కలికి శ్రీహరిరెడ్డి, బాధ్యులు కెహరినారపరెడ్డి, స్వర్ణలత, దామిశెట్టి సుధీర్‌నాయుడు, గంధం ప్రసన్నాంజనేయులు, టీమ్‌సేవియర్స్ జనసేన విజ్ఞానవేదిక లైఫ్స్‌బ్లడ్‌వరల్డ్ సభ్యులు, వివిధ స్వచ్ఛందసంస్థల బాధ్యులు పాల్గొన్నారు. ఖాదం బాష, దాసరి రాజేంద్రప్రసాద్, మలిరెడ్డికోటారెడ్డి, అజయ్‌బాబు, ఎ.సాయిరామ్, టిడిపి,బిజెపి,జనసేన నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## అధ్వాన్నంగా పంచేడు వయా జెండాదిబ్బ, బుచ్చిరోడ్డు





**బుచ్చి నవంబర్ 17 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం ముంబాయి రహదారి అద్వాన్నంగా తయారైంది. ఈ రోడ్డు బుచ్చిరెడ్డిపాళెం ముంబాయి రహదారి నుండి ప్రారంభం అయి జెండాదిబ్బ వయా పంచేడు,అన్నారెడ్డిపాళెం మూడు గ్రామాలకు వెళుతుంది. గత కొంత కొన్ని సంవత్సరాలుగా ఈరోడ్డు గురించి పట్టించుకున్న ధాఖలాలులేవు. ఈరోడ్డు కోవూరు నియోజకర్గం,ఆత్మకూరు నియోజకర్గం రెండు నియోజకవర్గాలకు సంబందించింది. నిత్యం వందల కొద్ది వాహనాలు ఈ రోడ్డు వెళుతుంటాయి .బురదగుంటల మయమైన ఈరోడ్డు ఆర్అండ్‌భి అధికారులు పట్టించుకున్న ధాఖలాలు లేవని ఆయా గ్రామాల ప్రజలు తీవ్రంగా విమర్శలు చేస్తున్నారు. కొత్త ప్రభుత్వంలో అయినా పాలకులు పట్టించుకొని ఈరోడ్డు పూర్తి స్ధాయిలో మరమ్మత్తులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

## ట్రాఫిక్ నియంత్రణకు షాపుల యజమానులు సహకరించాలి



**కందుకూరు, నవంబర్ 17, ప్రభాతవార్త** కందుకూరు డీఎస్పీ ఆఫీస్ ఆవరణలో కందుకూరు పట్టణంలో గల వివిధ వ్యాపార సంస్థల యాజమాన్యాలతో కందుకూరు డీఎస్పీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ కందుకూరు పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యల గురించి వివరించారు. కందుకూరు పట్టణరలో గల వివిధ వ్యాపార సంస్థల యాజమాన్యులు ఈ క్రింది సూచనలను పాటిస్తూ పట్టణంలోని ట్రాఫిక్ సమస్యను నియంత్రించాల్సిందిగా కోరుతున్నారు. కందుకూరు పట్టణంలో షాపులు, గోడౌన్లలో వివిధ వస్తువులు వాహనాల ద్వారా లోడ్, అన్లోడ్ చేసుకునేవారు, ప్రతి రోజు ఉదయం 8గంటల్లోపు రాత్రి 9గంటల తర్వాత చేయించుకోవాలన్నారు. ప్రతి షాపు యజమాని వారి షాపు ముందు ఉన్న ఫుట్‌పాత్‌కి రోలింగ్ వేయంచుకొని తగిన వైట్ లైన్స్ ఏర్పాటు చేసుకుని మోటారు బైకులు సదరు ప్రాంతంలో పార్కింగ్ చేయించుకోవాలన్నారు. షాపుల వాళ్ల వారికి సంబంధించిన వస్తువులు ప్రదర్శన ఫుట్ పాత మీద రోడ్ల మీద పెట్టి ఉంటున్నారు. వాటిని తొలగించి వారి షాపు లోపల పట్టుకోవాలని, సదరు ఫుట్‌పాత్‌ల మోటారు బైక్స్ పార్కింగ్ ఉపయోగించుకోవాలన్నారు. షాపులకు సంబంధించిన ఫ్లెక్సీలు బోర్డులు, ఫుట్‌పాత మీద, రోడ్డుకి అడ్డంగా ఏర్పాటు చేసి ఉన్నాయి. వాటిని వెంటనే తొలగించాలన్నారు. ప్రతి షాపు ముందు ఎలాంటి ఫోర్ వీలర్ వాహనాలు ఆపకుండా నో పార్కింగ్ బోర్డ్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. షాపుల ముందు అడ్డదుడ్డలుగా రోడ్ల మీద వాహనాలను నిలిపిన షాపు యాజమాన్య బాధ్యత చట్టపరమైన చర్యలకు వారు బాధ్యులుకాగలరన్నారు. ప్రతి షాపులో క్వాలిటీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొంత మంది షాపు యజమానులు వారి షాపు ముందు ఉన్న ఫుట్‌పాత్, రోడ్డు భాగంలో తోపుడు బండ్లు, ఇతర చిరు వ్యాపారస్తులువారి వ్యాపారాల నిర్వహణకు అద్దెకు ఇచ్చి డబ్బులు వసూళ్ల చేస్తున్నట్లు మా దృష్టిలో ఉన్నది, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అలాంటివి ఉంటే వెంటనే తొలగించుకోవాలన్నారు. మినహాయింపు షాపులు తప్ప మిగిలిన షాపులు అన్ని రాత్రి 10గంటలకు విధిగా మూసి వేయాలని, లేనిచో అక్కడ ఏదైనా గొడవలు జరిగిన సదరు షాపు యజమాని కూడా దానికి బాధ్యుడు కాగలరని అన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు విధంగా పాటించాలన్నారు. సీఐ కే.వెంకటేశ్వరరావు, ఎస్సై సాంబశివయ్యలు పాల్గొన్నారు.

## ఫిర్యాదుదారులకు ఆధార్ తప్పనిసరి



**నెల్లూరు క్రైమ్, నవంబర్ 17, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలో ప్రతి సోమవారం ఫిర్యాదులు అందజేసేందుకు వచ్చే అర్జీదారులు తప్పనిసరిగా తమ వెంట తమ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీని తీసుకురావాలని జిల్లా ఎస్పీ జి కృష్ణ కాంత్ ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఫిర్యాదుదారులు ఇది గమనించి తమకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## అంకమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



**విడవలూరు, నవంబర్ 17, ప్రభాత వార్త** గ్రామదేవతల వెలసిన శ్రీ అంకమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు అర్చనలు వివిధ రకాల పండ్లతో అలంకరణ చేశారు. సాయంకాలం అభిషేకం, కుంకుమార్చన పూల అలంకరణ, రాత్రి పల్లకి సేవ, భజన భక్త మండల వారిచే భక్తి గీతాలు కార్యక్రమం అత్యంత వైభవంగా జరిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాలకు ఉదయకర్తలుగా తాత వెంకయ్య, జయమ్మ, రాంబాబు రాజమ్మలు వ్యవహరించారు. ఆలయ అర్చకులు కొర్నాగిరి, సేవకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో కార్తీక వనభోజనాలు

### ఆలయంలో చండీ హోమం రుద్ర హోమం





**కందుకూరు, నవంబర్ 17, ప్రభాతవార్త** కందుకూరులోని కనిగిరి రోడ్డులో గల శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా శ్రీ అయ్యప్ప స్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనభోజన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు చండీ హోమం, రుద్ర హోమం పూర్ణాహుతి నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు కార్తీక వనభోజనం నిర్వహించారు. కార్తీక వనభోజన కార్యక్రమంలో మాలధారణ భక్తులు, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వైభవంగా స్వామివార్ల కళ్యాణ మహోత్సవం



**ఉలవపాడు, నవంబర్ 17, ప్రభాతవార్త** ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో వెలసి ఉన్న శ్రీ గంగా జ్ఞాన ప్రసూనమ్మ సమేత శ్రీ కాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం నందు కార్తీక మాసంలో భాగంగా స్వామివార్ల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా ఆదివారం జరిగింది. ఈ కళ్యాణ మహోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. తదుపరి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, ఉభయ దాత కోలగట్ల శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## పిల్లలకు చెస్, క్యారమ్స్ పోటీలు



**జలదంకి, నవంబర్17, ప్రభాతవార్త:** గ్రందాలయవారోత్సవాల లో భాగంగ ఆదివారం స్థానిక గ్రందాలయం లో విద్యార్దిని, విద్యార్దులకు చెస్, క్యారమ్స్ స్నేక్,అండ్ లీడర్ పోటీలను నిర్వహించారు. ప్ర ఖ్యాత కవులగూర్చి వివరించి వారి చరిత్రను చదివించారు. అనంతరం పౌష్టికాహారం అందజేశారు బండాగారి విజయలక్ష్మి తరచు పాఠశాల విద్యార్దులకు ఇలాంటి పోటీలు నిర్వహిస్తు వారిని గ్రందాలయానకి అలవాటుచేసి మంచిమంచి విషయాలు భోధించడం మంచి పరిణామంగ తల్లి, దండ్రులు కొనియాడుతున్నారు.

## కలిగిరిలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు



**కలిగిరి, నవంబర్17, ప్రభాతవార్త;**యుటిఎఫ్ కలిగిరి మండల శాఖ ఆద్వర్యంలో మండల కేంద్రమైన కలిగిరిలో ఆదివారం ఆంద్ర ప్రదేశ్ ఐఖ్య ఉపాధ్యాయపెడరేషన్(యుటిఎఫ్)స్వర్ణోత్సవ సంబరాలు జరుపుకున్నారు.కలిగిరి మండలమహాసభలో 2024;25 సంవత్సరానికి నూతనంగా యుటిఎఫ్ మండల శాఖ కమిటీనిఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షులుగా ఐ. ఉమామహేశ్వరరావు,అద్యక్షులుగా ఆర్. శ్రీనివాసులు ,యన్. గీతలను ఎన్నుకున్నారు.ప్రదాన కార్యదర్సిగాబి. నాగార్జున,ట్రెజరర్‌గా షేక్. షంషుద్దీన్. మండల కార్యదర్సిలుగా బి.హరిప్రసాద్, యస్‌లలిత, యన్ శ్రీనివాసబాబు,పి. ధనమ్మ,కె. సురేష్‌లనెన్నుకున్నారు.జిల్లా కౌన్సిల్ సబ్యులుగా కె. బాస్కర్‌రెడ్డి,యన్ శేషగిరిరావు,జి. వెంకటేశ్వర్లు, జి. మురళీక్రిష్ణ,బి. బారతి,నూతన కార్యవర్గంగా ఎన్నుకున్నటుకమిటీ తెలిపారు.

## మినీ రహదారిలో ప్యాచ్ వర్క్ పనులు



కోవూరు, నవంబం17ప్రభాతవార్త : కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీకి సంబంధించి మినీ జాతీయ రహదారిలో సర్వీస్ రోడునడ పలు చోట్ల పెండింగ్‌లో ఉంది. దీని వలన పడుగుపాడు ప్రాంత ప్రజలు ఈ సర్వీస్ రోడ్డు గుండా వెళ్లాలంటే అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో పడుగుపాడు పంచాయతీ కార్యదర్శి హజరత్‌బాబు ఈ విషయాన్ని ఆదివారం ఎన్‌హెచ్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలో చిప్స్ వేసి పాదాచారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. దీంతో ఆ ప్రాంత వాసులు సంతోషం వ్యక్తం చేశారు.

## మూర్ఛ వ్యాధిని నయం చేయవచ్చు



**నెల్లూరు, నవంబర్ 17, ప్రభాతవార్త-వైద్యం** సరైన అవగాహన సరైన వైద్యంతో మూర్ఛవ్యాధిని తగ్గించవచ్చని ప్రముఖ న్యూరో ఫిజిషియన్ డాక్టర్ ఏ.వైష్ణవి అన్నారు. ఆదివారం మద్రాస్ బస్టాండ్ వద్ద పోనిక్స్ హాస్పిటల్‌లలో కమ్యూనిటీ పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ మూర్ఛ వ్యాధి నివారణ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా న్యూరో ఫిజిషియన్ డాక్టర్ ఏ.వైష్ణవి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తగా 50 మిలియన్ల మందిని ప్రభావితం చేసే నాడీ సంబంధిత రుగ్మత అయిన మూర్ఛ గురించి అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం నవంబర్ 17న జాతీయ మూర్ఛ వ్యాధి దినోత్సవాన్ని జరుపుకుంటారని, మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తులకు సహాయాన్ని అందించడం, ప్రజలకు అవగాహన కల్పించడం, మూర్ఛ వ్యాధికి సంబంధించిన మూఢనమ్మకాలను తగ్గించడం జాతీయ మూర్ఛ వ్యాధి దినోత్సవ లక్ష్యం అని, సరైన అవగాహనతో చికిత్సతో మూర్ఛ వ్యాధిని తగ్గించవచ్చని తెలిపారు. ప్రధానంగా మూర్ఛ వ్యాధిలో స్పృహ తప్పడం, కళ్ళు పైకి తేలయడం, కాళ్ళు, చేతులు గట్టిగా కొట్టుకోవడం, నాలుక కోరుచుకోవడం లాంటివి రెండు మూడు నిమిషాలు నుండి కొన్ని సార్లు గంటల పాటు ఉంటాయని, దీనినే మూర్ఛవ్యాధిగా నిర్ధారించుకోవాలని తెలిపారు. కొన్ని రకాల మూర్ఛ వ్యాధులకు ఆపరేషన్ల ద్వారా పూర్తిగా నివారణ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పురిటి పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఆర్.గోకుల్ కృష్ణన్, జిల్లా పీహెచ్‌పీ నాయకులు శాఖవరపు వేణుగోపాలన, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, చిట్లురి వీరయ్య, ఉప్పలపాటి రామదాసు, భారతి తదితరులు పాల్గొన్నారు.

## గ్రంధాలయంలో పాటల పోటీలు




**ఉలవపాడు, నవంబర్ 17, ప్రభాతవార్త** 57వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం నాల్గో రోజు విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రంధపాలకుడు డి.కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గ్రంధపాలకుడు మాట్లాడుతూ ఈ పోటీల్లో మొత్తం 45 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా ఎస్‌బీఐ రిటైర్డ్ సీనియర్ అసిస్టెంట్ వి.బాలకోటయ్య వ్యవహారించారు. ప్రతి రోజు జరిగే పోటీలలో గెలుపొందిన విజేతలకు వారోత్సవాలు ముగింపు రోజున బహుమతులు ప్రధానం చేయదనున్నట్లు ఆయన తెలిపారు.

## మహనీయుల చరిత్రలు తప్పక చదవాలి



**కోవూరు, నవంబం17ప్రభాతవార్త :** కోవూరులోని పచ్చిపాల శంకర్‌రెడ్డి శాఖా గ్రంథాలయాల్లో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం కవుల సమ్మేళనానికి సంబంధించి గుర్రం జషువా, శ్రీశ్రీ చిత్రపటాలకు ఆర్టీసీ అధికారి ఎన్. శ్రీనివాసులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి మహనీయుల చరిత్రలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గ్రంథాలయంలో అటువంటి మహనీయుల పుస్తకాలు ఉన్నాయని, వాటిని పూర్తిగా చదివి మేదస్సును పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ జె. సురేంద్రరెడ్డి, ఉపాధ్యాయులు పి. రంగారెడ్డి, జీవీ కృష్ణారెడ్డి, విశ్రాంత ఉద్యోగి ఆర్. సత్యనారాయణ, కె. నాగిరెడ్డి, తదితరులు ఉన్నారు.

## దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



కోవూరు, నవంబం17ప్రభాతవార్త : కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ పరిధిలో ఈ వర్షాకాలం సీజన్‌లో ప్రజలు దోమల బెడదతో ఇబ్బందులు లేకుండా పంచాయతీ కార్యదర్శి హజరత్ బాబు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ప్రతిరోజూ పంచాయతీ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఫాగింగ్ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. దీంతో ఆ ప్రాంత గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## నారారామూర్తినాయుడి మృతికి నివాళులు



**సీతారామపురం నవంబర్ 17 ప్రభాతవార్త** మండలకేంద్రమైన సీతారామపురంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు సోదరుడు నారా రామూర్తి నాయుడికి మండల టిడిపి కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు ఆదర్యంలో ఘనంగా నివాళులర్పించారు. రామూర్తి నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సోమనబోయిన రాజశేఖర్, నేలటూరి జాషువా, రఘురామయ్య, సుబ్బయ్య, మురళీ,సుబ్బారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కూటమి ప్రభత్వంలో సంక్షేమ పరిపాలన



**కోవూరు, నవంబం17ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమ రంగంలో అందరికీ సంతృప్తికరమైన పాలన అందిస్తుందని టీడీపీ చేనేత నాయకులు కేవీ శేషయ్య తెలిపారు. లోక్ సభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిల ఆదేశాల మేరకు ఆదివారం కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో సీహెచ్ పెంచలయ్య, జి. వెంకయ్య, వి. శ్రీనివాసులు, డి. పురుషోత్తం ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ అనేక ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. మొదటి సారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి రైతుల కోసం తమ సొంత నిధులతో కాలువలు పూడిక తీయించి రైతుల కళ్లల్లో ఆనందం చూస్తున్నారన్నారు. అదేవిధంగా విద్య, వైద్యం, ప్రజా సంక్షేమ కోసం తమ సొంత నిధులను కేటాయిస్తూ కష్టపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## టిడిపి సభ్యత్వానికి అనూహ్యస్పందన



**సంగం నవంబర్ 17ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ సభ్యత్వానికి అనూహ్యస్పందన లభిస్తుందని టిడిపి నాయకులు క్లష్టర్ 9 ఇన్‌చార్జి బాణా శ్రీనివాసులురెడ్డి స్పష్టం చేశారు.ఆదివారం సంగం మండలంలో ఎఎన్ కండ్రిక, వెంకటేశ్వరపురం, చెక్‌పోస్టు సెంటర్‌లో 116 సభ్యత్వాలు చేయించినట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తెలుగుదేశం సభ్యత్వం ఉన్న కార్యకర్తలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రమాదభీమా (ఇన్సూరెన్స్) 5 లక్షలు,మృతి చెందిన వెంటనే మట్టిఖర్చులకు 10 వేలు ఇస్తారని తెలిపారు.ఇంతవరకు ఏపార్టీలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టలేదని ఆయన ప్రశంసించారు. దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నాయకత్వంలో సంగం మండలంలో నాయకులు,కార్యకర్తలు సభ్యత్వాలు పెద్దఎత్తున చేస్తున్నట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు భీమిరెడ్డి సుమన్‌రెడ్డి, చరణ్‌కుమార్‌రెడ్డి, గున్నం శ్రీనివాసులురెడ్డి, రొక్కరొక్కల లిఖిత్ పాల్గొన్నారు.

## నేడు అమరపనాయుడు కండ్రికకు చిన్నజీయర్‌స్వామి రాక



**సంగం నవంబర్ 17 ప్రభాతవార్త** సంగం మండలం లోని అమరపనాయుడు కండ్రికకు సోమవారం సాయింత్ర 4 గంటలకు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీరామన్నారాయణ రామనూజ జీయర్‌స్వామి వస్తున్నట్లు ల్యాంకో పౌండేషన్ వ్యవస్థాపకురాలు లగడపాటి రామలక్ష్మమ్మ, బాణా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ల్యాంకో పౌండేషన్ వారి ఆశ్రమానికి చిన్న జీయర్‌స్వామి వస్తున్నట్లు తెలిపారు. ప్రజలు విచ్చేసి స్వామి వారి ఆశీస్సులు తీసుకోవాలని ఆమె కోరారు.

## ఏఆర్‌డీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిరుపేదలకు టార్పాలిన్ పట్టలు, నిత్యవసర సరుకులు పంపిణీ



**ఇందుకూరుపేట, నవంబర్ 17, ప్రభాతవార్త** ఇందుకూరుపేట మండలం కుడితిపాలెం గ్రామంలో కాకర్ల దిబ్బ కాలనీ గిరిజన కుటుంబాలకి ఏఆర్‌డీ స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో టార్పాలిన్ పట్టాలు, నిత్యవసరాల సరుకులు పంపిణీ కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఈ మధ్య కురిసిన వర్షాకాలం ఇళ్లపైన కప్పుకునే టార్పాలిన్ పట్టలు, 14 రకాల నిత్యవసర సరుకులను అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ఏఆర్‌డీ సిబ్బంది పాల్గొన్నారు.

## 12వ పీఆర్సీ కమిటీ వేసి ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలి



**ఉదయగిరి, నవంబర్ 17, ప్రభాతవార్త** ఉదయగిరి మండల శాఖ 50 సంవత్సరాల స్వర్ణోత్సవాల సంబరాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం గవర్నమెంట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు ఉదయగిరి మండల మహాసభ అత్యంత వైభవంగా జరిగింది. మండల ఉపాధ్యాయ కార్యకర్తలు, మన యూటీఎఫ్ కుటుంబ సభ్యులు ఈ మహాసభల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ మహాసభలకు ముఖ్య అతిధిగా విచ్చేసిన జిల్లా ప్రధాన కార్యదర్శి జీవి చలపతిశర్మ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు వెంటనే 12వ పీఆర్సీ వేసి ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని 117 జీవో రద్దు చేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని, ఉపాధ్యాయులకు యాప్‌లా భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. జిల్లా సీనియర్ నాయకులు ఎన్నికల పరిశీలకులుగా కే.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యమ చరిత్రను కొనియాడారు. ఈ సభకు విచ్చేసిన జిల్లా కుటుంబ సంక్షేమ బాధ్యులు నాయబ్ భాషా మాట్లాడుతూ ప్రతి యుటీఎఫ్ సభ్యులు తప్పక ఎఫ్‌డబ్ల్యూఎఫ్ నందు సభ్యుడిగా చేరాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అంజాద్ గౌస్ భాషా, ఏడుకొండలు, జాఫర్ సా, రజియా బి పాల్గొన్నారు. అనంతరం మండల కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించి ఉదయగిరి మండల శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులు షేక్ కరిముల్లా, అధ్యక్షులు వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్కే ఎండీ హనీఫ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సన్మానాలు, రాష్ట్ర స్థాయి ఉర్దూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన షేక్ బేగంకి షేక్ సబియా సుల్తానా బేగంకి, జిల్లా అవార్డు అందుకున్న షేక్ ఖాదర్ భాషాకి మండల శాఖ పక్షాన ఘనంగా సన్మానించారు.

## మహిళా కండక్టర్‌పై దాడిని ఖండించిన మిరియం

### హరిబాబుపై రౌడీ షీట్ ఓపెన్ చేయాలి



**ఉలవపాడు, నవంబర్ 17, ప్రభాతవార్త** మహిళా కండక్టర్‌పై దాడి చేసిన హరిబాబుపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా యాదవ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో కోరారు. విచక్షణారహితంగా మహిళా కండక్టర్‌పై దాడి చేయడం దుర్మార్గమని అలాంటి వ్యక్తులను కఠినంగా శిక్షిస్తే మరోసారి ఇలాంటి ఘటనలు జరగవని శ్రీనివాసులు పోలీసు శాఖ వారికి విజ్ఞప్తి చేశారు. డ్యూటీలో ఉన్న మహిళా కండక్టర్‌పై దాడి చేస్తుంటే దాడిని అడ్డుకోవడానికి ప్రయత్నం చేసిన డ్రైవర్‌పైన కూడా దాడి చేయడం దారుణమని అలాంటి వ్యక్తిపై రౌడీ షీట్ ఓపెన్ చేయాలని శ్రీనివాసులు తెలిపారు. హరిబాబు లాంటి వ్యక్తులను మహిళా కండక్టర్లకు మనోధైర్యాన్ని కల్పించాల్సిన బాధ్యత పోలీసు శాఖపై ఉందని శ్రీనివాస్ తెలిపారు.

## పినాకిని ఆశ్రమంలో లాలాలజపతి రాయ్ వర్ధంతి కార్యక్రమం




ఇందుకూరుపేట, నవంబర్ 17, ప్రభాతవార్త పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రయంలో పంజాబ్ కేసరి లాలా లజపతిరాయ్ వర్ధంతి కార్యక్రమం, సర్వమత ప్రార్ధనలు ఆదివారం జరిగాయి. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గంపల మంజుల ముందుగా మహాత్మాగాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రం, నూలుమాల సమర్పించారు. అనంతరం ఆశ్రమ స్థల దాత పోనక కనకమ్మ విగ్రహానికి పట్టు వస్త్రం, నూలుమాన సమర్పించారు. అనంతరం కమిటీ సభ్యులు గంపల మంజుల లాలా లజపతిరాయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమకారుడు, రచయిత, రాజకీయ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, అతను భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించాడన్నారు. లాల్ బాల్ పాల్ త్రిమూర్తులలోని ముగ్గురు సభ్యులలో ఒకరు ఆయన చివరగా నవంబర్ 17, 1928న బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ప్రదర్శన చేస్తున్నప్పుడు బ్రిటీష్ వారి బృందం అతన్ని కొట్టి చంపారని, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించారని గుర్తు చేశారు. అలాంటి మహోన్నత వ్యక్తులను స్వతంత్ర్య పోరాట కేంద్రంగా పేరొందినటువంటి పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆయనకి ఘన నివాళులర్పించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, స్కూల్ విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## 17.7 అడుగులకు చేరిన రాళ్లపాడు ప్రాజెక్టు నీటిమట్టం





లింగసముద్రం,నవంబర్ 17,ప్రభాతవార్త రాళ్లపాడు ప్రాజెక్టు నీటిమట్టం ఆదివారంసాయంత్రానికి 17.7 అడుగులకు చేరింది. అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుండి వరద నీరు వచ్చి చేరుతుంది. అలాగే సోమశిల ప్రాజెక్టు ఉత్తర కాలువ నుండి నీరు ప్రాజెక్టులోకి రావడంతో ఆదివారం సాయంత్రానికి నీటిమట్టం 17.7 అడుగులకు పెరిగిందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో వర్షాలు పడితే నీటిమట్టం పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## అయ్యప్పస్వామి పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే



**కావలి, నవంబర్ 17 ప్రభాతవార్త** కావలి పట్టణం 37వవార్డులో నివసిస్తున్న తెలుగు దేశంపార్టి రాష్ట్ర లీగల్‌సెల్ ఉపాధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది పొట్లూరి శ్రీనివా సులు నివాసంలో ఆదివారం ఏర్పాటుచేసిన అయ్యప్పస్వామి పడిపూజ మహోత్స వంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పడిపూజ మహోత్స వంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు అయ్యప్పస్వామి కృపాకటాక్షాలు తప్పకుండా ఉండాలని, స్వామివారి చల్లనిచూపు కావలి నియోజకవర్గపు ప్రజలపై ఉండాలని ఎమ్మెల్యే దగుమాటి అయ్యప్పస్వామిని వేడుకున్నారు. టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీనియర్ రాజకీయనేత తాళ్లూరికి నివాళులర్పించిన ఎమ్మెల్యే




**కావలి, నవంబర్ 17 ప్రభాతవార్త** నెల్లూరుజిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటి మాజీ ఛైర్మన్ తాళ్లూరి రమణయ్యనాయుడు ఇటీవల మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి టిడిపి నేతలతో ఆదివారం దగదర్తిలోని తాళ్లూరి నివాసానికి వెళ్లారు. తాళ్లూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులైన తాళ్లూరి కుమారులతో ప్రగాఢసానుభూతిని వ్యక్తం చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దగదర్తి మండల టిడిపి అధ్యక్షులు అల్లం హనుమంతరావు, తెలుగు దేశంపార్టి రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్‌చౌదరి, సోమశిల ప్రాజెక్టు మాజీఛైర్మన్ కండ్లగుంట మధు బాబునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## మురికి నీటిలో సంఘమిత్ర కార్యాలయం పొదుపు సభ్యులకు అగచాట్లు పట్టించుకోని అధికారులు



**కొడవలూరు (విడవలూరు), నవంబర్ 17, ప్రభాతవార్త** మండల కేంద్రంలో ఉన్న సంఘమిత్ర కార్యాలయం మురికి నీటితో నిండి ప్రజలకు దర్శనమిస్తుంది. ఇటీవల కురిసిన వర్షాలకు వర్షపు నీరు చేరి మురికిగా మారింది. అయితే నిత్యం పొదుపు గ్రూపు సభ్యులు కార్యాలయంకు వస్తూ వెళ్తుంటారు. మురికి నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతు ఉండడంతో సభ్యులతో పాటు అధికారులు కూడా విధి నిర్వహణకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్య కొన్ని నెలల నుండి ఇలానే ఉంది. ప్రభుత్వాలు మారుతున్న అధికారులు మారిన ఎవ్వరు కూడా పట్టించకపోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల పొదుపు సభ్యులు పలు సమస్యలపై కార్యాలయంకు కచ్చితంగా వెళ్ల వలసిన పరిస్థితి ఉన్నప్పటికీ స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుండి ప్రహరీ గోడ తొలగించి వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడిందని మహిళలు చర్చించుకుంటున్నారు. ఇకనైనా ఉన్నత అధికారులు మత్తు నిద్రలో నుంచి లేచి మురికి నీటిలో ఉన్న వెలుగు కార్యాలయాన్ని వెలుగులోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## రెండేళ్ల క్రితం తహసిల్దార్ కార్యాలయం ఇరిగేషన్‌కు బదిలీ శిధిలవస్థలో కార్యాలయం పట్టించుకుని అధికారులు




**కొడవలూరు (విడవలూరు), నవంబర్ 17, ప్రభాతవార్త** ప్రజలకు ఎంతో ప్రాధాన్యత కలిగిన కార్యాలయం ఉంది అంటే అది ఒక్క తహసిల్దార్ కార్యాలయం అని చెప్పుకోవచ్చు. ఎందుకంటే ఎంతోమంది రైతన్నలకు సంబంధించి లక్షల ఎకరాల రికార్డులు భద్రపరిచే లాకర్ గది ఏది అంటే తహసిల్దార్ కార్యాలయం అని ప్రజలు గుర్తు పెట్టుకుంటారు. అలాంటి కార్యాలయంకు సరైన భవనం లేక ఇరిగేషన్ బంగ్లా కార్యాల యంలో ఉండవలసిన పరిస్థితి ఏర్పడింది. అప్పట్లో తహసిల్దార్ కార్యాలయం శిధిలవస్థకు చేరుకోగా 2006లో పున: ప్రారంభం చేశారు. అయినా వర్షాల కారణంగా భవనం పూర్తిగా కూలిపోయే పరిస్థితికి చేరుకుంది. రెండు సంవత్సరాల నుండి తాసిల్దార్ కార్యాలయం ఇరిగేషన్ కార్యాలంకు బదిలీ అయినట్లు దర్శనమిస్తుంది. సమస్యలపై వచ్చే ప్రజలు ఎక్కడ తాసిల్దార్ కార్యాలయము అని తికమక పడుతు వెను తిరుగుతున్నారు. వివరణ తహసిల్దార్ స్ఫూర్తి రెడ్డి ( ప్రభాతవార్త)తో ఫోన్ లైన్ ద్వారా మాట్లాడుతూ తహసిల్దార్ కార్యాలయం శిధిలవస్థకు చేరుకుంది. అప్పటినుండి ఇరిగేషన్ బంగ్లాలో విధులు నిర్వహిస్తున్నాం ఈ విషయం గతంలోఉన్న తహసిల్దార్ అప్పటి జిల్లా కలెక్టర్‌కు తెలియపరచడం జరిగింది. మరల కూడా నూతన భవన నిర్మాణం కోసం పై అధికారులకు నివేదిక పంపడం జరుగుతుందని తెలియజేశారు.

## పట్టపగలే కోడి వ్యర్థాలు తరలింపు

### పట్టించుకోని అధికారులు



**విడవలూరు, నవంబర్ 17, ప్రభాత వార్త** కోడి వ్యర్థాలు తరలింపు నిషేధమని స్థానిక ఎమ్మెల్యే చెప్పిన లెక్కచే యకుండా కోడి వ్యర్థాలను పట్టపగలే నిర్వాహకులు చేపలగుంటలకు తరలిస్తున్నారు. ఈ వ్యర్థాలు తరలిస్తున్న సమయంలో దుర్వాసన వెదజల్లడంతో అటుగా వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులతో పాటు రోగాలకు గురవుతున్నారు. ఈ కోడి వ్యర్థాలతో చేపలను సాగు చేస్తూ వాటిని ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఈ కోడి వ్యర్థాలు వేస్తున్న చేపలగుంటలో నీరు కాలువలకు వదలడంతో అవికాస్త కలుషితమై ఆ నీటి తాగిన మూగ జీవాలు వ్యాధిన పడుతున్నాయి. ఇకనైనా మండల అధికారులు స్పందించి కోడి వ్యర్థాలు తరలించే వారిపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## నేడు జాబ్ మేళా



**కొడవలూరు (విడవలూరు), నవంబర్ 17, ప్రభాతవార్త** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల టిడిపి నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో యువతి, యువతలకు మెగా జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. 24 పంచాయతీల సంబంధించి ప్రజలు, యువకులు, పార్టీ కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

## నారా రామ్మూర్తి నాయుడు అంత్యక్రియల్లో కాకర్ల



**వింజమూరు, నవంబర్17ప్రభాత వార్త:** టిడిపి అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోదరుడు నారా రామ్మూర్తి నాయుడు అంత్యక్రియల్లో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొన్నారు. చిత్తూరు జిల్లా చంద్ర గిరి మండలం నారావారి పల్లెకు ఆదివారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు పార్థివ దేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం నిర్వహించిన అంత్యక్రియల్లో కాకర్ల సురేష్ పాల్గొన్నారు

## చాలెంజ్ విసురుతున్న విద్యుత్ మోటార్ల దొంగలు

**కలిగిరి, నవంబర్17, ప్రభాతవార్త;** కలిగిరి మండలంలో విద్యుత్‌వైర్ల దొంగతనాలు, విద్యుత్ మోటార్ల దొంగతనాలు అధికమౌతున్నాయి. రైతులు అప్పుసప్పులు చేసి పొలాల్లో విద్యుత్ మోటర్లు బిగించుకుంటే రాత్రి వేళల్లో దొంగలు విలువైన వైర్లను, మోటార్లను దొంగిలించి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఒక్క మోటర్ వైరు కొనాలంటే సుమారు 400లు పడుతుంది. అలాంటి వైర్లు రైతు వేలాదిరూపాయలు పెట్టికొని మొటార్లు వద్ద కనక్షన్లు ఇస్తే రాత్రి వేళల్లో వచ్చిన దొంగలు అందినకాడికి కట్‌చేసి తీసుకుపోతున్నారు. దీనివల్లరైతు వేలాదిరూపాయలు నష్టపోతున్నాడు. అయినా వైరు తప్పనిసరికనుక మరలా అప్పోసప్పోచేసి మరలా కనక్షన్ ఇచ్చినా దొంగలు మరలాకత్తించకపోతున్నారు. దీనివల్లరైతులు అప్పులతో అల్లాడిపోతున్నారు. ఇక విద్యుత్ మోటార్లు వేలాదిరూపాయలు పెట్టికొనుగోలు చేసినా దొంగలు మోటార్లు పెరికి అందులోని రాగి వైరు కోసం మోటార్లను దొంగిలిస్తున్నారు. దీనితో రైతులు ఏమిచేయాలో అర్ధకాక లబోదిబోమంటున్నారు. కన్నీరు కారుస్తూ పోలీసులకు పిర్యాదులు చేయడం మరలా కొత్తవి కొనుగోలుచేయడంతో రైతుల బాదలు వర్ణనా తీతంగామారుతున్నాయి. శనివారం ఒక్కరాత్రి కలిగిరి మండలంలోని క్రిష్ణారెడ్డిపాళెంకు చెందిన సుమారు 5మందిరైతులకు చెందిన మోటార్లనుదొంగలు ఒక్కరాత్రి కత్తిరించి తీసుకెళ్లారని బాదితులు ఎరజర్ల మాల్యాద్రి, పల్లప్రోలు రామిరెడ్డి, నలతాటి బుద్ధుడు తదితరులు తెలిపారు. వీటివిలువ సుమారులక్షా50వేలవరకూ ఉంటుందని వాపోయారు. పోలీసులకు పిర్యాదు చేసినట్లు బాదితులు తెలిపారు.

## రెండు రోజులు పాటు ఆధార్ సేవలు



**కోవూరు, నవంబం17ప్రభాతవార్త :** కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాంశాల సమావేశ మందిరంలో ఆదివారం సైతం ఆదార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని ఆదివారం ఎంఈవో-2 వై. చెంచులక్ష్మమ్మ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పాంశాలకు సంబంధించి ఆధార్‌లో ఏమైనా తప్పు ఒప్పులు ఉంటే వాటికి సరైన సమాచారాన్ని చూపించి తప్పులు సరిదిద్దుకోవాలన్నారు. రెండు రోజుల పాటు ఈ పాఠశాలలోనే ఈ కేంద్రం ఉంటుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

## మోగిన నీటి సంఘాల ఎన్నికల నగారా



**కోవూరు, నవంబం17ప్రభాతవార్త :** గత ఐదు సంవత్సరాలుగా సాగునీటి సంఘాలకు గత ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించిన దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన నాలుగు నెలల తర్వాత సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు శ్రీకారం చుట్టింది. ఈ నెలాఖరులోగా ఎన్నికలు నిర్వహించేందుకు సంబంధిత ఇరిగేషన్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా సాగునీటి సంఘాలు ఉన్న మండలాల్లో ఈ ఎన్నికలకు సంబంధించి అధికారుల సిబ్బందిని నియమించడం, వారికి శిక్షణా తరగతులు నిర్వహించడం జరిగింది. జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాలు ఉన్న మండలాల్లోని కూటమి ప్రభుత్వం నాయకులు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఈ నేపథ్యంలో కోవూరు మండలానికి సంబంధించి మొత్తం మూడు సాగునీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయి. కోవూరు, ఇనమడుగు, పాటూరులో ఈ సంఘాలు ఉన్నాయి, కోవూరు సాగునీటి వినియోగదారుల సంఘాలకు సంబంధించి మొత్తం ఓట్లు 691గా ఉండగా.. అందులో పురుషులు 439, మహిళలు 252 మంది ఉన్నారు. అదేవిధంగా ఇనమడుగు సాగునీటి వినియోగదారుల సంఘాలకు సంబంధించి మొత్తం ఓట్లు 897గా ఉండగా.. అందులో పురుషులు 583, మహిళలు 314 మంది ఉన్నారు. అదేవిధంగా పాటూరు సాగునీటి వినియోగదారుల సంఘాలకు సంబంధించి మొత్తం ఓట్లు 768గా ఉండగా.. అందులో పురుషులు 476, మహిళలు 292 మంది ఉన్నారు. ఒక్కొక్క సాగునీటి వినియోగదారుల సంఘానికి సంబంధించి 12 మంది సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంది. ఈ 12 మంది నుంచి ఒక అధ్యక్షుడిని, ఒక కార్యదర్శిని ఎన్నుకోవాల్సి ఉంది. ఈ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు 1432 ఫసలీ వరకు ఎటువంటి బకాయిలు ఉండరాదు. ఒకవేళ బకాయిలు ఉంటే అటువంటి వారు ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులు అని తాజాగా ఎన్నికల సంఘం ఇచ్చిన బుక్‌లెట్‌లో పొందుపరిచారు. అదేవిధంగా క్రిమినల్ కేసులు ఉన్నవారు, ప్రభుత్వ ఉద్యోగం చేసేవారు ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం లేదు. ఇప్పటికే ఈ ఎన్నికలకు సంబంధించి సంబంధిత ఇరిగేషన్ అధికారులు సాగునీటి వినియోగదారుల సంఘాలు ఉన్న మండలాల్లో తహసీల్దార్ కార్యాలయం నోటీస్‌బోర్డులో ఓటర్ లిస్టులు కూడా ఏర్పాటు చేశారు. మొత్తం మీద ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు జరిగిన ఆరు నెలల తర్వాత మరలా ఈ ఎన్నికలు జరగడం గమనార్హం.

## పాఠశాలల పనివేళలు మార్పు

### - పైలెట్ ప్రాజెక్టుగా మండలానికి 1పాఠశాల



**కోవూరు, నవంబం17ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనను మరింత మెరుగులు దిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా పాఠశాలల పనివేళలను మార్పు చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఉదయం 9 గంటలకు ఫస్ట్ బెల్ , 9.05కు రెండవ బెల్, అదేసమయంలో అసెం బ్లీని ఏర్పాటు చేసి 5 గంటల వరకు పాఠశాల వేళలు పెంపుదల చేశారు. గతంలో ప్రభుత్వ పాఠశాలకు సంబంధించి పాఠశాలల వేళలు ఉదయం 9 నుంచి 4 గంటల వరకు ఉండగా.. ప్రస్తుతం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన పాఠశాలల్లో 5 గంటల వరకు పనివేళలు పొడిగించారు. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని అన్ని మండలాల విద్యాశాఖ కార్యాలయాలకు ఆదేశాలు కూడా విడుదల చేసింది. ఈ పాఠశాల పనివేళల మార్పుకు సంబంధించి మండలానికి ఒక ఉన్నత పాఠశాల , హైస్కూల్ ప్లస్‌ను ఎంపిక చేసేలా సంబంధిత డిప్యూటీ విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ మారిన పనివేళలను ఈ నెల 25 తేది నుంచి 30వ తేది వరకు పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్నారు. సంబంధిత డిప్యూటీ విద్యాశాఖ అధికారులు ఒక్కొక్క మండలానికి 1పాఠశాల చొప్పున ఎంపిక చేసి ఆ వివరాలను 20వ తేది లోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పంపాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. అనంతరం ఈ వారం రోజుల పా టు పాఠశాలల పనివేళలు పైలెట్ ప్రాజెక్టుగా మార్పు చేసిన పాఠశాలల నుంచి నివేదికను తీసుకుని 30వ తేది లోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పంపేలా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

## ఇకనైనా మారండి



**కోవూరు, నవంబం17ప్రభాతవార్త :** సమాజంలో రౌడీ షీటర్లుగా , అనుమానితులుగా ఇతరత్రా కేసుల్లో ముద్ర పడిన వ్యక్తులు ఇకనైనా మారి సమాజంలో బుద్ధిగా బతికేలా దృష్టి పెట్టాలని కోవూరు ఎస్సై రంగ నాథ్ గౌడ్, తెలిపారు. కోవూరు పోలీస్టేషన్ ప్రాంగణంలో ఆదివారం రౌడీ షీటర్లుగా ముద్ర పడిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తెలిసో తెలియకో ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడ్డారని, ఇకనైనా తమ తీరు మార్చుకుని సమాజంలో బుద్ధిగా బతికేలా చూడాలన్నారు. ఈ విధంగా ముద్రపడి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులో ఉన్న వారిపై ఎప్పటికప్పుడు ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. గొడవలు, దౌర్జన్యా లు ఇతరనేర కార్యకలాపాల్లో పాల్గొన్న వారిపై శాఖాపరమైన చర్యలుతప్పవన్నారు. దీనిని దృష్టిలో పెట్టు కుని పాతజీవితానికి స్వస్తిచెప్పి కొత్త జీవితానికి ప్రతి ఒక్కరూ మంచి నడవడికతో ముందుకు సాగాలన్నారు.

## భార్య, అత్తపై కత్తితో దాడి

**నెల్లూరు క్రైమ్, నవంబర్ 17, ప్రభాతవార్త :** భార్యను కాపురానికి పంపలేదని ఓ వ్యక్తి భార్యతో పాటు ఆమె తల్లిపై కత్తితో దాడి చేసి గాయపరిచిన ఘటన స్థానిక నవాబుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జగనన్న కాలనీలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు జగనన్న కాలనీకి చెందిన మాధవికి ముత్తుకూరు గ్రామానికి చెందిన పేరంబాక సురేష్‌తో కొన్నేళ్ళ కిందట వివాహమైంది. భార్యాభర్తల మధ్య తరచూ జరుగుతున్న గొడవలతో వ్యక్తి చెందిన మాధవి నా పుట్టింటికి వచ్చింది. మూడు నాలుగు నెలలుగా అక్కడే ఉంటుంది. అయితే తన భార్యను తన ఇంటికి పంపించాలని తరచూ గొడవ పడుతున్న సురేష్ ఆదివారం ఉదయం జగనన్న కాలనీలోని తన అత్త సుజాతమ్మ ఇంటికి వచ్చి వారితో గొడవ పెట్టుకున్నాడు. ఈ క్రమంలో విచక్షణ కోల్పోయి తన వెంట తెచ్చుకున్న మచ్చు కత్తితో తన భార్య, అత్తలపై తీవ్రంగా గాయపరిచాడు. తీవ్ర గాయాలు పాలైన వారిద్దరిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఫిర్యాదు అందుకున్న నవాబుపేట ఎస్ఐ షేక్ అన్వర్ భాష కేసు దర్యాప్తు చేపట్టారు.

## యూటిఎఫ్ మండల అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులుగా నారాయణ,సుబ్రమణ్యం



**వరికుంటపాడు,నవంబర్ 17,ప్రభాతవార్త :** మండల యూటిఎఫ్ మండల శాఖ అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులుగా మరోమారు ఎల్ వి నారాయణ,వి వి సుబ్రమణ్యంలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక వరికుంట పాడు ఉన్నత పాఠశాలలో జరిగిన యూటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలకు ముఖ్య అతిధులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.చలపతి శర్మ పాల్గొన్నారు. అనంతరం మండల నూతన కమీటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు ఎల్‌వి నారాయణ,ప్రధాన కార్యదర్శిగా వివి సుబ్రమణ్యం,గౌరవ అధ్యక్షులు గా రాయం వెంకటేశ్వర్లు,ఉపాధ్యక్షులుగా పోలుబోయిన మనోహర్,సిహెచ్ శ్యామల,ట్రెజరర్‌గా డి.చం ద్రమౌళి,జిల్లా కౌన్సిలర్ లుగా షేక్ కరిముల్లా,కె.చంద్రశేఖర్ రెడ్డి,రావెళ్ల నాగార్జున,కె వి కాంతా రావు, కె.కృష్ణ కుమారి,కె.హేమలత మహిళ కన్వీనర్‌గా ఆర్‌భవాని,సహ కన్వీనర్ కె.భువనేశ్వరి ,సెక్రటరీలుగా ప్రసాద్ రావు,మాలకొండయ్య,మధు,స్వప్న,ఈశ్వరయ్య,గురవయ్య,నిజాముద్దిన్ ఆడిట్ కమి టి సత్యనారాయ ణ,అబ్దుల్ రవూఫ్,సుధాకర్,పి.రాధాకృష్ణ,ఎఫ్‌డబ్లుఎఫ్ కమిటీ నాగరాజు, పి.రాధాకృష్ణ,రాజేంద్ర ప్రసాద్ నరసింహరావు లను ఎంపికయ్యారు.నూతన కార్యవర్గంతో ఎన్నికల అబ్జర్వర్ జిల్లా కార్యదర్శి షేక్ ఖాజావలి ప్రమాణ స్వీకారం చేయించారు.

## నారా రామ్మూర్తినాయుడుకు నివాళులర్పించిన టీడీపీ నాయకులు



**కందుకూరు,నవంబర్16,ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చం ద్రబాబునాయుడు సోదరుడు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు శనివారం తుది శ్వాస విడిచారు. ఆదివారం నియో జకవర్గ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాలతో కందుకూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నారా రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి ఘ నంగా నివాళులర్పించారు. పట్టణ ప్రధాన కార్యదర్శి ముచ్చు శ్రీనివాసరావు, నాయకులు బెజవాడ ప్రసాద్, చుండూరి శ్రీను, షేక్ ఫిరోజ్, పులి నాగరాజు, మేడ మల్లిఖార్జున, గుమ్మా శివ, కాకుమాని మాల్యాద్రి, యర్రా మునలయ్య, షేక్ మాభాష, ముచ్చు ఓంకారం, శ్రీను, ఇతర నాయకులు ఉన్నారు.

## సాయి మాలధారణలతో గోలగమూడికి పాదయాత్ర



**నెల్లూరు,నవంబరు17 ప్రభాతవార్త-విద్య** శ్రీ సాయి మాలధారణ మండల దీక్ష, శిరిడీ యాత్ర సందర్భంగా నగరంలోనిస్థానిక బాలాజీనగర్,పద్మావతి నగర్‌లోని శ్రీసాయిధర్బార్,అదా ల సాయి బాబా మందిరం నుండి ఆది వారం గోలగమూడి వెంకయ్య స్వామి ఆల యం వరకు నిర్వహించిన పాదయాత్ర వైభ వంగా సాగింది. ముందుగా సాయి భక్తులు అద్దాల సాయిబాబా మందిరం వద్దకు కాషా య రంగు వస్త్రాలు ధరించి చేరుకోగా అక్కడ నుండి గోలగ మూడికి అందరూ సామూహికంగా ఓం సాయి, శ్రీ సాయి, శ్రీ సాయి నామ సంకీర్తనలతో, ఓం నారాయణ, ఆదినారాయణ నామ కీర్తనలతో పాదయాత్ర సాగించారు. సాయి భక్తుల పండరి భజనలు, కోలాటాలతో పాదయాత్ర ఆశాంతం కన్నుల పండుగలా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మధుసాయి మాట్లాడుతు సుమారు 400మందికి పైగా భక్తులు ఈ యాత్రలో ఏకరక దుస్తులు దరించి పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. ఈ యా త్ర విజయవంతానికి కృషిచేసిన వారికి దన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాబోలు రామ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## భానుమూర్తిని సన్మానించిన ఉద్యోగ సంఘ నేతలు



**నెల్లూరు, నవంబర్ 17, ప్రభాత వార్త- వైద్యం** ఆంధ్రప్రదేశ్ స్టేట్ హెల్త్ ఎడ్యుకేటర్స్ సర్వీస్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మిలినేని భూనుమూర్తి తిరుపతి జిల్లా డిప్యూటీ మాస్ మీడియా ఆఫీసర్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా స్టేట్ హెల్త్ ఎడ్యుకేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ చేజర్ల సుధాకరరావు, పలు ఉద్యోగ సంఘ నాయకులు ఆదివారం నగరంలోని హరినాథపురంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖలో పలు ఉద్యోగ సంఘాల్లో రాష్ట్ర అధ్యక్షులుగా, రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా వ్యవహరిస్తూ ఉద్యోగుల డిమాండ్ల సాధనలో కృషి చేస్తూ ఉద్యోగులకు అండగా నిలబడుతున్న భానుమూర్తి సేవలు అభినందనీయమని సుధాకరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు బాలు, మల్లిఖార్జున, ఝాన్సీ లక్ష్మీ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ హెల్త్ ఎడ్యుకేటర్స్ సర్వీస్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ హరిప్రసాద్, జాయింట్ సెక్రటరీ సునీత, జిల్లా నాయకులు అశోక్, ఉమర్, ఆరోగ్య మేరి, బిబిజాన్, రమేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## రామ్మూర్తినాయుడుకి నివాళులర్పించిన మంత్రి నారాయణ



**నెల్లూరు, నవంబర్ 17, ప్రభా తవార్త-వైద్యం** నగరంలోని గోమతి నగర్‌లో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోదరుడు నారా రామ్మూ ర్తినాయుడు చిత్రపటానికి మంత్రి నా రాయణ, అబ్దుల్ అజీజ్‌లు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోదరుడు రామ్మూర్తినాయుడు 1952లో జన్మించారని, 1994లో చంద్రగిరి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని తెలిపారు. చంద్రబాబునాయుడుకు అన్ని విధాలా చేదోడు వాదోడుగా ఉంటూ చంద్రగిరి రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించారన్నారు. ఆయనకు ఇద్దరు పిల్లలని, వారిలో నారా రోహిత్ చిత్రసీమలో హీరోగా ఉన్నారని పేర్కొన్నారు. ఆయన మృతి తీరనిలోటని ఈ సందర్భంగా తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు. అలాగే ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని మంత్రి నారాయణ కోరారు. అజీజ్, కోటంరెడ్డి మాట్లాడుతూ రామ్మూర్తి నాయుడు గతంలో చంద్రబాబునాయుడుకు ఎంతో అండగా ఉండేవారన్నారు. ఆయన అకాల మరణం చంద్రబాబునాయుడు కుటుంబానికి, తెలుగుదేశం పార్టీకి తీరని లోటని ఈ సందర్భంగా వారు తెలిపారు. కీలక దశలో విద్యార్థి దశ నుండి చంద్రబాబునాయుడుకు అండగా ఉన్నారని తెలిపారు. రామ్మూర్తి నాయుడు మరణం అందరికి బాధకలిగిస్తుందన్నారు. భగవంతుడు ఆయన కుటుంబానికి మనోధైర్యాన్ని ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మహిళా నేతలు తాళ్లపాక అనురాధ, ముప్పాళ్ల విజేత, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు నిత్య విద్యార్థిగా ఉండాలి



**నెల్లూరు,నవంబరు17 ప్రభాతవార్త-విద్య** సమాజంలో వస్తున్న మార్పులు,నూతన సాంకేతికత తదితర అంశాలను ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులుగా ఉంటూ ఎప్పటి కప్పుడు నేర్చుకుంటూ ఆ ఆ విజ్ఞానాన్ని విద్యార్థులకు బోధించాలని అపుస్మా నాయకులు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని స్థానిక సంఘమిత్ర పాఠశాలలో నెల్లూరు రూరల్ అపుస్మా పాఠశాలల్లోని అధ్యాపకులకు శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా అపుస్మా రాష్ట్ర ఉపాధ్యక్షులు నేతాజీ సుబ్బారెడ్డి మాట్లాడుతు అపుస్మా పాఠశాలల్లోని ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు నూతన విద్యా విదానాలను అవగాహన చేసుకునేందుకు క్రమం తప్పకుండా ఈ శిక్షణా తరగతులను నిర్వహించటం జరుగుతుందన్నారు. హైదరాబాద్ కు చెందిన గంటూరు కృష్ణజ్యోతి నేడు ఈ సదస్సుల్లో పాల్గొని శిక్షణ ఇవ్వటం సంతోషంగా ఉందని, అందరూ ఉపాధ్యాయులు ఈ శిక్షణా తరగతుల్లో పాల్గొని విజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ తరగతులను నిర్వహించటం జరిగిందన్నారు. అపుస్మా నగర అధ్యక్షులు వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు నేలనూతల శ్రీధర్, కోశాధికారి కృష్ణారావు, నాయకులు హరినాథ్, బాస్కర్‌రెడ్డి, అభిషేక్ రెడ్డి, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.